క్లుప్తంగా

మరిడమ్మ తల్లికి మఖ నక్షత్ర పూజలు



చండీహోమం నిర్వహిస్తున్న ఆలయ పండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి ఆదివారం బంగారు, వెండి పుష్పాలతో మఖ నక్షత్ర పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కొమరగిరి విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితుడు

కొత్తపల్లి: కొమరగిరిలో వేంచేసిన అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గత నాలుగు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఉదయం పండితులు స్వామివార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మిల్లర్లపై నిఘా ఉంచాలి



రైతుల పరిస్థితిని ప్రత్యేకాధికారి వసంత మాధవికి వివరిస్తున్న రైతు నాయకులు

సామర్లకోట: రైతుల నుంచి ధాన్యం తీసుకోవలసిన మిల్లర్లపై నిఘా ఉంచాలని రైతు, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుల నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసేలా చూడాలని ధాన్యం కొనుగోలు మండల ప్రత్యేకాధికారి వసంత మాధవిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొంత మంది మిల్లర్లు సీఎంఆర్ ధాన్యం సేకరణ కంటే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

వేసవి శిబిరంలో ఉత్సాహంగా చిన్నారులు



చిన్నారులకు ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణసాయి

సామర్లకోట: మాధవపట్నం శివారులోని జమునానగర్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బాల మందిరం, జన విజ్ఞానవేదిక జిల్లా శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో శుక్రవారం జేవీవీ జిల్లా నాయకులు, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె కృష్ణ సాయి హాజరై చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నాడు-నేడు పనుల పరిశీలన



హైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న డీవైఈఓ తదితరులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నాడు-నేడు ఫేజ్ 2 పనులను డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె డానియల్‌రాజు శుక్రవారం పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ పనుల ప్రగతిని వివరించారు. మొదటి అంతస్తు శ్లాబ్ పనులు పూర్తి కావడంతో డీవైఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ తెరిచే నాటికి మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య, హెచ్‌ఎంలు మీనామాధురి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిటేషన్ వియర్లు



సర్‌ప్లస్ వియర్ల నుంచి వస్తున్న గోదావరి మిగులు జలాలు



తూటేరు డ్రైన్‌లో గుర్రపు డెక్క తొలగిస్తున్న కూలీలు



వీకే రాయపురంలో నీట మునిగిన పొలాలు

- అధికారుల అనాలోచిత చర్యలు
- పొలాలను ముంచుతున్న మిగులు జలాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు రైతుల సన్నద్ధం

సామర్లకోట: నీటిపారుదల అధికారుల నిర్లక్ష్యం వల్ల పచ్చటి పొలాలను, వ్యవసాయ ఉత్పత్తులు నీట మునిగిపోతున్నాయని వీకే రాయపురం రైతులు ధ్వజమెత్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సామర్లకోట గోదావరి కాలువలోకి కొంత నీరు చేరింది. ఈ అదనపు నీటిని సముద్రంలోనికి విడిచి పెట్టడానికి సామర్లకోట, వీకే రాయపురం, ఇంద్రపాలెంల వద్ద లాకులు ఏర్పాటు చేశారు. అయితే గోదావరి కాలువలో నీటి మట్టం ఎక్కువగా ఉందనే సాకుతో వేట్లపాలెం వద్ద ఉన్న సర్ వియర్లు ఎత్తివేశారు. దాంతో గోదావరి కాలువలోని నీరు వీకే రాయపురం, బోయనపూడి రైతుల పంట పొలాల్లోకి వచ్చేసింది. దీంతో సుమారు నాలుగు వేల ఎకరాలు నీటి మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో అదనపు నీరు పోయే తూటేరు డ్రైను మూసుకు పోయిందని రైతులు అంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని, దీనివల్ల నీరు వెనక్కు తన్ని పంటలకు నష్టం జరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలితలకు వివరించామని, ఇరిగేషన్ అధికారుల తీరుపై శనివారం కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం..



ఏడేళ్లుగా పూడిక తీయక తూటేరు డ్రైను నుంచి నీరు వెనక్కు తన్నుతోంది. వర్షాలు, కాలువలో నీరు తగ్గాక పూడిక తీసేలా అధికారులపై ఒత్తిడి తెస్తాం. వియర్ గేట్ల ఎత్తివేత వల్ల జరిగే పంట నష్టాన్ని కూడా కలెక్టర్‌కు వివరిస్తా.

– దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, సామర్లకోట

విద్యార్థులను భాగస్వాములను చేయండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

పెద్దాపురం: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు కోరారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఆయన ఎంఈఓ, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వీలుంటుందని నాగరాజు అన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వీకే రాయపురంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విడుదల చేసిన రూ.10 లక్షలతో నిర్మించనున్న గణపతి ఆలయానికి దొరబాబు భూమి పూజ చేశారు. అలాగే కొన్నేళ్లుగా నిర్మాణానికి నోచుకొని డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పొలాలు, ధాన్యం రాశుల వద్దకు రైతు భరోసా కేంద్రం సిబ్బంది వెళ్లి రైతుల అంగీకారంతో ధాన్యం కొనుగోలు చేస్తారని దొరబాబు తెలిపారు. సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, సొసైటీ అధ్యక్షుడు ఉటా వాసు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, ఎలిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

ఇంటికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడపగడపకూ మన ప్రభుత్వం



గొల్లప్రోలులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలులో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతికుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఎన్నికల్లో వస్తారు.. మళ్లీ కనిపించరు.. ఏదైనా పని కావాలంటే మేము వెళ్లినా పట్టించుకోరు.. కాని ఇప్పుడు మీరు మేము పిలవకపోయినా మా ఇంటికి వచ్చి మా సమస్యలు అడుగుతున్నారు.. చాలా ఆనందంగా ఉంది అంటు స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంట్లో వారిని పలకరించి ఆయా ఇళ్లలో ఎవరెవరికీ ఏయే పథకాలు అందుతున్నాయి అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. ఎవరికీ ఏదీ రాలేదనే మాట లేకుండా అన్ని వర్గాలకూ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అర్హతే ప్రామాణికం తప్ప పైరవీలు, సిఫార్సులు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొగలి అయ్యారావు, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు పర్ల రాజా, కన్వీనర్ మొగలి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో సమస్యలు వింటున్న దొరబాబు

రీడింగ్ రూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పిఠాపురం: గొల్లప్రోలు శాఖా గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ రూమ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. దీనికి కుర్రా సుదర్శన కుమారి మెమోరియల్ రీడింగ్ హాల్‌గా నామకరణం చేసినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిలర్ గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం

పెద్దాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 14వ సచివాలయం పరిధిలో 24, 26వ వార్డుల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయరు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు పేరింశెట్టి అంబిక, త్సలికి సత్యభాస్కర్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నాటకాలేల!

ఎమ్మెల్యే రాజప్పపై దవులూరి ధ్వజం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలపై దొంగ నాటకాలు ఆడడం సరికాదని ఎమ్మెల్యే చినరాజప్పకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సూచించారు. పెదబ్రహ్మదేవం గ్రామంలో ఆయన మాట్లాడిన మాటల్లో వాస్తవం లేదని దొరబాబు అన్నారు. స్థానిక ముప్పన సోమరాజు, వీర్రాజు కళ్యాణ మండపం వద్ద శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాజప్ప మాటలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. విపత్తుల నివారణ శాఖ మంత్రిగా పని చేసిన ఆయన ఏ మాత్రం అవగాహన లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రకటనలు చేయడం దారుణమన్నారు. నాలుగో తేదీ ఒక్క రోజే ఆర్బీకే వద్ద 360 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే కేవలం 20 టన్నులు కొనుగోలు చేశారని అబద్దాలు చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆయన వెనుక ఉన్న కార్యకర్త దళారి వ్యవస్థను నడుపుతున్నారని, తనకు ఎక్కడా మేలు చేకూరదోనని తప్పుడు కథనాలు చెబుతుంటే రాజప్ప ఇంగిత జ్ఞానం లేని మాటలు మాట్లాడడం సరి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వం, అధికారులపై ప్రకటనలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మలకల సూరిబాబు, గోపు మురళి, మలకల వరహాలు, యినకొండ వీర విష్ణుచక్రం. నరాలశెట్టి త్రినాథ్, రైతులు ఉన్నారు.

ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు



ఉప్పాడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: నవరత్న పథకాలతో ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు జగనన్న ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. గత నాలుగేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని చూసి మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కాకినాడ ఎంపీ వంగా గీత



విఘ్నేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా పలు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్టు కాకినాడ ఎంపీ వంగా గీత తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నూతనంగా నిర్మించిన పురాతన విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు సైతం ప్రభుత్వ పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి తీర్థం



కొత్తపల్లిలో ముత్యాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసిన చిరుతాడిని గరగ నృత్యాలతో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే దొరబాబు, నాయకులు

కొత్తపల్లి: ముత్యాలమ్మతల్లిని ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దొరబాబును ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో సత్కరించారు..

ఉపాధి హామీ పనుల పరిశీలన



చెందుర్తిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. రికార్డులు, మస్టర్లు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గ్రామాల్లో ఉపాధి పనులపై మేట్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కూలీలకు పూర్తి స్థాయిలో వేతనం దక్కేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సూరంపేటకు దారి చూపాలని వినతి

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ రైల్వే ట్రాక్ అవతల వైపు ఉన్న సూరంపేట కాలనీకి దారి చూపించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి కాకినాడ వచ్చిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరిని శుక్రవారం గొల్లప్రోలు నగర పంచాయతీ బీజేపీ నేత చిట్టా మధు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే శాఖ ద్వారా ట్రాక్ అవతల వైపు ఉన్న 1600 ఎకరాల రైతులు, ఒక వార్డు ప్రజలకు దారి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కొమ్మకొమ్మకు పనసాయెరా!

- చెట్టు చిన్నదే అయినా కాపు పెద్దది
- పార్కు స్థలంలో ఆకట్టుకుంటున్న చెట్టు



కాయలతో నిండిన పనస చెట్టు

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయనగర్ లేఅవుట్ పార్కులో పనస చెట్టు నోరూరిస్తోంది. పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని ఇంటి యజమాని ఆరు నెలల క్రితం ఈ మొక్క వేశాడు. వేసవిలో పనస పళ్లు అందుబాటులోనికి రావడంతో మొక్క చిన్నదే అయినా ప్రతి కొమ్మకు పనస పళ్లు కాసాయి. దాంతో ఆ ప్రాంతంలో ఉన్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు క్యాంప్ కార్యాలయానికి వచ్చే ప్రతీ ఒక్కరూ పనస చెట్టు వైపు ఆసక్తిగా చూస్తున్నారు. సుమారు 50 వరకు ఆ చెట్టు పనసపళ్లు ఉన్నాయి. మరో 10 రోజులలో పళ్లు తినడానికి అందుబాటులోనికి వస్తాయని స్థానికులు తెలిపారు.

కాలువలోకి దిగి వ్యక్తి గల్లంతు



సాయికుమార్ (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఓ వ్యక్తి కాలువలోకి దిగి ప్రమాదావశాత్తూ గల్లంతైనట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...గురువారం రాత్రి ఏకే మల్లవరానికి చెందిన నలుగురు స్నేహితులు కత్తిపూడిలోని ఒక దాబా హోటల్‌కు వెళ్లి అర్ధరాత్రి తిరిగి తమ గ్రామం చేరుకున్నారు. వారిలో వి. సాయికుమార్ ఎలియాస్ కాశీ గ్రామంలో ఉన్న చెరువు కాలువలోకి కాళ్లు కడుగుకుంటానని దిగాడు. అతను ఎంతకు బయటకు రాక పోయే సరికి మిగిలిన వారు అతని కోసం గాలించినా ఫలితం లేక పోవడంతో విషయాన్ని అతని బంధువులు, గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు శుక్రవారం అతని కోసం గాలించిన ఫలితం కనిపించలేదు. సంఘటన స్థలాన్ని కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ పరిశీలించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు సంఘటన స్థలానికి వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని 22వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

ముంపు పొలాల పరిశీలన

పిఠాపురం: భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతుంటే అధికారులు పట్టించుకోడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో నీట మునిగిన, తడిసిన వరి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు కళ్లాల్లో ధాన్యం తడిసిపోయాయన్నారు. వరి పనలు నీట మునిగినా ఏ ఒక్క వ్యవసాయాధికారి రైతులను పలకరించిన పాపాన పోలేదని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జిల్లాకు రాగానే అధికారుల్లో చలనం వచ్చిందన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

జారకుండా శుభ్రం చేశారు



పి. వేమవరం రోడ్డులో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: మండల పరిధిలోని పి.వేమవరం వెళ్లే రహదారిలో పేరుకుపోయిన చెత్తను అధికారులు శుక్రవారం తొలగించారు. బుధవారం 'రహజారులు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై డీపీఓ కార్యాలయం నుంచి స్థానిక పంచాయతీ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దాంతో పంచాయతీ కార్యదర్శి బుల్లియ్య కాపు శుక్రవారం జేసీబీ సాయంతో రోడ్డు మార్జిన్‌లో చెత్తను పూర్తిగా తొలగించారు. ఈ మేరకు పి.వేమవరం గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.